ప్రజాశక్తి

బుధవారం 20 ఆగస్టు 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కులో ఇఒఐలపై సిపిఎం భగ్గు

◆ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కోసమేనంటూ ఆగ్రహం
◆ విశాఖలో ర్యాలీ, ధర్నా

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ) పేరుతో కేంద్ర బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించడానికి బిడ్లను ఆహ్వానించడంపై సిపిఎం భగ్గుమంది. ఇది స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే చర్యేనని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇఒఐలను రద్దు చేయించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు విశాఖ నగరంలోని జగదాంబ జంక్షన్‌లో మంగళవారం ప్రదర్శన, దర్నా చేపట్టింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్య దర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటన, అనంతర పరిణామాలను వివరించారు. ఈ ఆర్థిక ప్యాకేజీతో కార్మికులను, ప్రజలను మభ్యపెట్టి ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం వేగవంతం చేసిందన్నారు. ప్లాంట్లో ప్రస్తుతం సుమారు 600 స్థానిక ప్రైవేటు ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు ఉన్నారన్నారు. వారి స్థానంలో కేంద్ర ప్రభుత్వ, కూటమి ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోని 50 పెద్ద ఏజెన్సీలను నియమిస్తారన్నారు. కీలక విభాగాల్లోని ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికులకు ఆపరేషన్‌లో ఎటువంటి పాత్రా ఉండదని, వారి సంఖ్య బాగా తగ్గించబడుతుందని అన్నారు. నిర్వాసితులు ఉద్యోగ అవకాశాలు కోల్పో తారన్నారు. ప్రస్తుత కాంటాక్ట్ కార్మికులను వేల సంఖ్యలో తొలగిస్తారన్నారు. వారి స్థానంలో ఇతర రాష్ట్రాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులను నియమించి వారికి ఎటువంటి చట్టపరమైన హక్కులు, రక్షణ కల్పించకుండా శ్రమదోపిడీ చేస్తారన్నారు. బడా కాంట్రాక్టర్లు, అధికారంలోని రాజకీయ గెద్దలకు లబ్ది కట్టబెట్టాలన్న కుట్రలో భాగమే ఈ ఇఒఐలని తెలిపారు. వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం చెప్తారని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో రక్షించడం కన్నా రాష్ట్ర ప్రయోజనాలు ఏముంటాయని జగ్గునాయుడు ప్రశ్నించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కాపాడి, అభివృద్ధి చేసేందుకు పూనుకోవాలన్నారు. అక్రమంగా తొలగించిన 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్లాంట్‌లో ఇంత జరుగుతున్నా స్థానిక గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వారిరువురూ ప్రజలను మోసగించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, మిగతా 2లో..

ఒప్పందాలు చేసుకున్న ఏపి, రష్యన్ ప్రతినిధులు

రష్యా కంపెనీలతో ఒప్పందాలు

ఉపాధి కల్పన కోసమన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : రష్యాకు చెందిన వివిధ కంపెనీలు, సంస్థల్లో ఉపాధి కల్పించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మంగళవారం స్థానిక ఫోర్ పాయింట్ హోటల్‌లో ప్రాథమిక సమావేశం జరిగింది. రష్యాకు చెందిన స్కిల్ కార్పొరేషన్, అధికార ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. రష్యా నుంచి సెక్రటరీ జనరల్ అనోవా మైకేయిల్, వివిధ హోదాలగల అధికారులు, ఆంధ్రప్రదేశ్ నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి జి.గణేష్ కుమార్, ఆంధ్రా యూనివర్సిటీ వీసీ జీపీ రాజశేఖర్, ప్రభుత్వ సలహాదారు సీతా శర్మ, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇడి మనోహర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఉపాధి కల్పనా అధికారులు అరుణ, శాంతి హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగా ఎల్ఒఐ (లెటర్ ఆఫ్ ఇంటెంట్)/ప్రాథమిక ఒప్పంద పత్రాలను ఏపి, రష్యా ప్రభుత్వ ప్రతినిధులు మార్చుకున్నారు. విశాఖ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్న రష్యా ప్రతినిధులు మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. ప్రాథమిక స్థాయి సమావేశంలో భాగంగా మిగతా 2లో..

20 నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

▶ వార్త 2లో..

736 కిలోల గంజాయి పట్టివేత

▶ వార్త 8లో..

నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టొద్దు!

▶ వార్త 7లో..

సత్తా చాటిన భీమవరం బుల్స్

కాకినాడ కింగ్స్‌పై ఘన విజయం

ప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచిన మునీష్ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిఎల్ సీజన్ - 4లో భాగంగా మంగళవారం విశాఖలోని ఎసిఎ - విడిసిఎ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై భీమవరం బుల్స్ అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమవరం బుల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేయగా కాకినాడ కింగ్స్ 19.5 ఓవర్లలో 187 పరుగులకు ఆల్ అవుట్ అయింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమవరం బుల్స్ జట్టులో ఓపెనర్ కె.రేవంత్ రెడ్డి 38 బంతులలో రెండు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 51 పరుగులు చేసి శుభారంభం అందించారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ టి.శరన్ 33 బంతులలో మూడు సిక్స్‌లు, 6 ఫోర్లతో 58 పరుగులు చేశాడు. చివరిలో బ్యాటింగ్‌కు వచ్చిన బి.మునీష్ వర్మ 14 బంతులలో ఆరు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 43 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. కాకినాడ కింగ్స్ బౌలర్లలో పిఎం.గంగాధర్ 2, కె.సుదర్శన్ 2 వికెట్లు తీయగా ఎస్.కమరుద్దీన్ ఒక వికెట్ తీశాడు. 215 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కాకినాడ కింగ్స్ జట్టులో కెప్టెన్ కెఎస్.భరత్ 40 బంతుల్లో ఐదు సిక్స్‌లు, ఆరు ఫోర్లతో 76 పరుగులు చేయగా ఓపెనర్ పిఎ.టెండూల్కర్ 12 బంతుల్లో మిగతా 2లో..

సమాజ మార్పులో పత్రికలు కీలకపాత్ర

◆ ప్రజాశక్తి అక్షరానికి విలువెక్కువ : కలెక్టర్ హరేంధిర ప్రసాద్
◆ ఘనంగా ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయ నవీకరణ, యంత్రాల ప్రారంభోత్సవం

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వేదికపై శర్మ తదితరులు

ప్రజాశక్తి - గాజువాక

సమాజ మార్పులో పత్రికలది కీలక పాత్ర అని విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయం నవీకరణ, నూతన యంత్రాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రింటింగ్ మెషిన్‌ను, సిటిపి మెషిన్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాశక్తి విశ్వస నీయ వార్తలు రాస్తూ జనంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. ఆ పత్రిక రాసే ప్రతి అక్షరానికీ ఎంతో విలువ ఉందన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం కథనాలు రాస్తూ పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. సమాజంలో పత్రికల పాత్రను వివరించారు. తన స్నేహితుడు ఐఎఎస్ అధికారి కావడానికి పత్రికలే దోహద పడ్డాయన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ విశాఖలో ప్రజాశక్తి ఎలా విస్తరించిందో తెలియజేశారు. నేడు రాష్ట్రంలోని ప్రధాన పత్రికలు టిడిపికో, వైసిపికో అనుకూలంగా ఉంటూ వార్తలు రాస్తున్నాయన్నారు. ప్రజాశక్తి మాత్రమే ప్రజల సమస్యలపై వాస్తవికత ఆధారంగా వార్తలు రాస్తోందని మిగతా 2లో..

స్విచ్ ఆన్ చేసి సిటిపి మెషిన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

మొదటి పేజీ తరువాయి..

ఉక్కులో ఇఒఐలపై సిపిఎం భగ్గు

పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు, జిల్లా కమిటీ నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, ఆర్ఎస్ఎన్.మూర్తి, యుఎస్ఎన్.రాజు, ఉరుకూటి రాజు పాల్గొన్నారు.

ప్లాంట్ రక్షణకు చర్యలు తీసుకోవాలి : ఐద్వా

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేయడానికి ఇఒఐ పేరుతో అతి ముఖ్యమైన విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రభుత్వ కుట్రలను ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు.

పరవాడ : ఈవోఐ పేరుతో కేంద్ర బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించడానికి బిడ్లు ఆహ్వానించడంపై సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం పరవాడ ఫార్మాసిటీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పరోక్షంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు చేస్తున్న ఈ చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే జోక్యం చేసుకొని ఆపాలని డిమాండ్ చేశారు. తమ వల్ల స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని, దీనిని లాభాల బాట పట్టిస్తామని, కార్మికులకు, నిర్వాసితులకు న్యాయం చేస్తామని, ఆర్థిక పేకేజీ తమ ప్రభుత్వం సాధించిన ఘనత అని చెప్పుకున్న ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.అప్పలరాజు, జి.చిట్టిబాబు, కే రమణ, శేషు, తదితరులు పాల్గొన్నారు

రష్యా కంపెనీలతో ఒప్పందాలు

రష్యాలో ఉన్న పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వం అందించే సహకారం, పారిశ్రామిక యూనిట్లు - ఉద్యోగులకు మధ్య ఉండే సంబంధాలను రష్యా ప్రభుత్వ ప్రతినిధి అనోవా మైకేయిల్ పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఎపిలో అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, యువతకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ, విద్యా సంస్థలు, ముఖ్యంగా మెటలర్జీ కోర్స్ గురించి కోన శశిధర్ విపులంగా వివరించారు. యువతకు మెరుగైన రీతిలో శిక్షణ అందించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన క్వాంటమ్ కంప్యూటింగ్, మెటలర్జీ కోర్సుల గురించి ఎయు విసి రాజశేఖర్ తెలియజేశారు.

సత్తా చాటిన భీమవరం బుల్స్

మూడు సిక్స్‌లు, మూడు ఫోర్లతో 31 పరుగులు చేశాడు. కాకినాడ కింగ్స్ జట్టులోని ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించకపోవడంతో 187 పరుగులకు ఆల్ అవుట్ అయింది. భీమవరం బుల్స్ బౌలర్లలో భూపతిరాజు, మునీశ్ వర్మ మూడు ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి రెండు కీలక వికెట్లు తీయగా, సి.శివ 2, ఎస్.రాజు 2, టి.శరన్, బి.రావు ఒక్కో వికెట్ తీశారు. భీమవరం బుల్స్ జట్టులో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించిన మునిష్ వర్మకు ప్లేయర్ అఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది

20 నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని న్యాయస్థానాల్లో సిబ్బంది నియామకానికి ఈ నెల 20 నుండి 24 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. పరీక్షల నిర్వహణపై హైకోర్టు జారీ చేసిన సూచనలను చిన్నంశెట్టిరాజు జిల్లా జడ్జి ఛాంబరులో మంగళవారం మీడియాకు వివరించారు. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, కాపియిస్ట్, డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తారని, 3 షిఫ్టులలో ఈ పరీక్షలు కంప్యూటర్ ద్వారా జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయానికి 15 నిమిషాలు ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఐడిప్రూఫ్‌ను తీసుకురావా లన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్‌నంబరు 0863-237252 లేదా e-mail helpdesk-hc.ap.aij.gov.in ద్వారా సంప్రదించాలన్నారు. పరీక్షల్లో అర్హత సాధించిన స్టెనోగ్రాఫర్-3 జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్లకు తరువాత స్కిల్‌టెస్ట్ నిర్వహిస్తానన్నారు. దివ్యాంగులైన పరీక్ష రాయలేని వారికి మెడికల్ ఎమర్జెన్సీ వలన పరీక్ష రాయలేని వారికి వారి అభ్యర్థన మేరకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం పరీక్షలు జరుగుతాయని అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు లోనుకావద్దని పుకార్లను నమ్మవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు.

లోక్‌అదాలత్‌తో కేసుల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఆర్.సన్యాసినాయుడు కోరారు. న్యాయసేవసదన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, విశాఖపట్నంలో బీమా సంస్థల అధికారులు, స్టాండింగ్‌కౌన్సిల్స్, ఎంవిఐపి కేసుల్లో పిటిషనర్ న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

కేసుల పరిష్కారం, బీమావివాదాల సత్వర పరిష్కారంపై చర్చించారు. వచ్చేనెల 13న జరగబోయిన లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్‌అదాలత్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్‌అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీమాసంస్థల అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్స్, ఎంవిఐపి కేసుల్లో పిటిషనర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సమాజ మార్పులో పత్రికలు కీలకపాత్ర

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సదారావు, శర్మ, అచ్యుతరావు

మోటూరు, కొరటాల చిత్రపటాల వద్ద నివాళి

(మొదటి పేజీ తరువాయి..)

తెలిపారు. విశ్వసనీయత ప్రజాశక్తి బలమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, మతోన్మాద అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ చైతన్యపరుస్తోందన్నారు. ఐ అండ్ పిఆర్ విశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సదారావు మాట్లాడుతూ నిజాలు తెలుసుకోవాలంటే ప్రజాశక్తి చదవాలన్నారు. ఆ పత్రికతో తనకు చిన్నప్పటి నుంచీ అనుబంధముందన్నారు. నిజాలను నిర్భయంగా రాసే పత్రిక అని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పాలకుల విధానాలు ప్రజలను నష్టపరిస్తే ప్రజాశక్తి దునుమాడుతుందన్నారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు మాట్లాడుతూ చాలా పత్రికల్లా ప్రజాశక్తి అభూత కల్పనలు రాయదన్నారు. ప్రజాశక్తి ప్రస్థానాన్ని వివరించారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్.సుధాకర్ మాట్లాడుతూ పత్రికను పాఠకులకు చేర్చడంలో సిబ్బంది, ఏజెంట్ల కృషిని తెలియజేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ మీడియా వ్యాపారమైన నేటి పరిస్థితుల్లో బడుగు, బలహీన వర్గాల కోసం ప్రజాశక్తి పనిచేస్తోందన్నారు. సిఎంఆర్ గ్రూప్ సిజిఎం లింగమూర్తి మాట్లాడుతూ పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తొలుత మోటూరు హనుమంతురావు చిత్రపటానికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి ఎంవిఎస్.శర్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సదారావు హాలును, ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సిఎంఆర్ గ్రూపు సిజిఎం లింగమూర్తి తొలికాపీని కొనుగోలు చేశారు.

నృత్యాలతో ఆకట్టుకున్న మహిళలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తోకాడ సమైక్య అపార్టుమెంట్ మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గరీమా హార్మోనియంపై దేశభక్తి గీతాలను ఆలపిస్తూ అలరించింది. చిన్నారి జహన్విక (మిమ్మి) భరత నాట్యానికి చప్పట్ల వర్షం కురిసింది. సీనియర్ ఏజెంట్లు అరుణ్‌జీ, తేలయ్యబాబులను సభా వేదికపై ఘనంగా సత్కరించారు. ప్రజాశక్తి బ్యూరో చీఫ్ ఎన్.మధుసూదన్ రావు అతిథులకు ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాఠకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మిక కార్డన్ సెర్చ్

ఎనిమిది మందిపై కేసులు నమోదు
- కత్తులు, గంజాయి, నగదు, బంగారం స్వాధీనం

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రాత బాగ్చి, ఆధ్వర్యంలో నగర పోలీసులు మంగళవారం తెల్లవారుజామున నగరంలో అన్ని ప్రాంతాల్లో రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. జోన్-1 , జోన్-2 , క్రైమ్ విభాగం కలిపి మొత్తం 525 మంది అధికారులు , సిబ్బందితో 103 టీంలుగా ఏర్పడి, ప్రతీటీమ్ బాడీవార్న్ లేదా మొబైల్ కెమెరాలను వినియోగిస్తూ, రౌడీ, సస్పెక్ట్‌షీటర్ల ఇళ్ళు తనిఖీ చేస్తునప్పుడు ఒక మహిళా పోలీసు కానిస్టేబుల్, హోంగార్డ్ కూడా ఉండి సుమారు 500 మంది రౌడీ, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జోన్-1 నందు భీమిలి పరిధిలో రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఎం.వి.పి పరిధిలో ఒక ఇంట్లో కత్తి, 2 కిలోల గంజాయి, ఎం.వి.పి పరిధిలో మరొక ఇంట్లో 6 లక్షల 800 రూపాయల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలు, జోన్ 2 కంచరపాలెం పరిధిలో 2.5 కిలోల గంజాయి, గోపాలపట్నం పరిధిలో 11 క్వార్టర్ మద్యం బాటిళ్ళ స్వాధీనం చేసుకున్నారు. మూడో పట్టణ పరిధిలో చోరీకి గురైన 4 మొబైల్‌ఫోన్లు, నాల్గోపట్టణ పరిధిలో రెండు హ్యాండ్‌గ్లోవ్స్, గోపాలపట్నం పరిధిలో ఒక సస్పెక్ట్ షీటర్ ఇంట్లో ఒక వ్యక్తి గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. పై సంఘటనల్లో 8 మందిపై కేసులు నమోదు చేసామని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

బాలికల మిస్సింగ్ కేసు ఛేదన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర కంచరపాలెంలో ఇద్దరు బాలికలు అదృశ్యం అయ్యారు. సోమవారం రాత్రి జరిగిన సంఘటనపై బాలికలతల్లి గేదెలరేఖ కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేదెల ప్రీతి(10)గేదెల శతి(9) ఇంట్లో ఉండగా సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన తల్లి రేఖకు తమపిల్లలు కనిపించకపోవడంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం సిఐ రవికుమార్ ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలపగా, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రతబాగ్చి మూడు టీంలను ఏర్పాటు చేశారు. బీచ్ ప్రాంతంలో ఒక టీం గాలిస్తుండగా కంచరపాలెంలో ఎస్సై దివ్యభారతి ఆధ్వర్యంలో ఓ టీం జల్లెడ పట్టారు. మరో టీం రైల్వేస్టేషన్ ప్రాంతంలో వెతుకుతుండగా, కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట వద్ద ప్రీతి, శృతి ఉన్నట్లుగా సమాచారం రావడంతో ఎస్సై దివ్యభారతి హుటాహుటిన వెళ్లి చిన్నారులను బుజ్జగించి తల్లికి అప్పగించారు.

ప్లాస్టిక్ వద్దే వద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఒక్కసారి వాడివదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసిన వైజాగ్ ఎన్‌జిఒ ఫోరం నూతన కార్యవర్గంతో ఆయన మాట్లాడారు. పలుసేవా కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిర్వహించడం జరుగుతుందన్నారు.

IN THE HONOURABLE COURT OF THE VIITH SPECIAL MAGISTRATE COURT AT VISAKHAPATNAM
S.T.C.NO. 1510/2024

Between:
Bonthu Suryanarayana
S/o Ramulu late . . . Complainant
And:
Nayudu Venkata Satyanarayana,
S/o Nayudu Koteswararao
. . . Accused

PUBLIC NOTICE

To,
The Accused
Nayudu Venkata Satyanarayana,
S/o Nayudu Koteswararao,
Hindu, Aged about 55 years,
D.No. 51-16-44/4, Kranthi Nagar,
Nakkavanipalem,
Visakhapatnam. 530013,
(Aadhar:3465 7744 2340),
CellNo.9949087986

Please take notice that the above named Complainant filed the above matter against the accused. The complainant filed the above Summary Trail Case (S.T.C) to serve the summon to the accused by way of Publication. The above matter stands posted on **09-09-2025 at 10:30AM** for your appearance, and on that day you are required personally or through advocate to attend before the Hon'ble Court at **10:30 AM.** Failing which the matter will be heard and determined in your absence and proceed further as per law.

K.P.NAIDU
Advocate, Visakhapatnam.

గౌరవ మోటారు ఎక్సిడెంట్ క్లైమ్స్ ట్రిబ్యునల్ కమ్ నాలుగువ అదనపు జిల్లా జడ్జి (SC & ST (POA) కోర్టులో
MVOP 289/2022

బిట్వీన్ :- వంక బంగారమ్మ మరియు ఇతరులు
.......పిటీషనర్లు
ఎండ్ :- మున్వీర్ పర్వేజ్ మరియు ఇతరులు
.....రెస్పాండెంట్స్

టు,
R5. ఉప్పలపాటి నాగసుదీప్తి D/o జగన్నాథరాజు, డోర్ నెం. 32-10-49/3, మాన్‌సూన్ వెంకటేశ్వర కాలనీ, శీలానగర్, గాజువాక, విశాఖపట్నం.

Summon Notice

పై నెంబరు కోర్టులో 10-9-2025న వాయిదా వుంది. 5వ ప్రతివాది అయిన మీరు వ్యక్తిగతంగా గాని మీ లాయరు గారి ద్వారా కాని **తే10-9-2025 తేదీన ఉ॥ 10-30 గం॥లకు** పై కేసుకు సంబంధించిన మీ వద్దగల డాక్యుమెంట్లుతో పై కోర్టునందు హాజరు కాగలరు. లేని ఎడల మీ పరోక్షంలో గౌరవ కోర్టువారు కేసును విచారించి తగిన ఆర్డరు మంజూరు చేయగలరు.

కాళ్ళ సన్యాసిరావు
న్యాయవాది,
జరజాపుపేట గ్రామం,
నెల్లిమర్ల మండలం,
విజయనగరం జిల్లా

అత్యున్నత ప్రమాణాలే దేశ అభివృద్ధిలో కీలకం

ప్రజాశక్తి- విశాఖపట్నం : అత్యున్నత ప్రమాణాలతో ఉత్పత్తుల తయారీ దేశాభివృద్ధిలో కీలకంగా నిలుస్తుందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సౌత్) మీనాక్షి గణేషన్ అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ కళాశాలతో సంయుక్తంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ "స్టాండడైజేషన్ అండ్ కాన్ఫార్మిటీ అసెస్మెంట్"ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థకు, ఒక వ్యవస్థకు శక్తినిచ్చేది కేవలం ప్రమాణాలేనని తెలిపారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా అధ్యాపకులకు భారతీయ, అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. 2023లో ఆంధ్ర విశ్వవిద్యాలయం బిఐఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకొని విభిన్న కార్యక్రమాలను, పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆచార్యులకు విభిన్న అంశాలపై బిఐఎస్ నిపుణులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, బిఐఎస్ సంయుక్తంగా కలిసి పనిచేయడం ఈ ఎఫ్‌డిపి ప్రత్యేకతని వివరించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ దీనిని కరికులంలో భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. ఇంజినీరింగ్ అంశాలకు ప్రమాణాలు (స్టాండర్డ్స్) ఎంతో అవసరమని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బిఐఎస్ శాఖలను స్థాపించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో మంచి పరిణామం అని చెప్పారు. ఇప్పటికే మూడు విభాగాలలో బిఐఎస్ విద్యార్థి శాఖలను ఏర్పాటుచేశామని మరొక నూతన శాఖను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

అతిథులకు జ్ఞాపికను అందిస్తున్న ఎయు వీసీ రాజశేఖర్

ఎఫ్‌డిపి కార్యక్రమం సమన్వయకర్త ఆచార్య సిఎన్‌వి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, బిఐఎస్ అందించే ప్రత్యేకమైన సమాచారం, పుస్తకాలతో గ్రంథాలయంలో ఒక ప్రత్యేకమైన విభాగాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. టెస్టింగ్, ఇన్‌స్పెక్షన్, సర్టిఫికేషన్ అంశాలపై బిఐఎస్ విపులంగా వివరిస్తుందని చెప్పారు. బిఐఎస్ శాస్త్రవేత్త ఎంఎజె.వినోద్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం తరపున మీనాక్షి గణేషన్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్యాన్ ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... దొండపర్తి ప్రాంతానికి చెందిన సిహెచ్.దుర్గాప్రసాద్ (30) మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. రెండేళ్లుగా ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. దుర్గాప్రసాద్ తండ్రి వద్ద ఉంటున్నాడు. తండ్రి వ్యాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి విధులకు వెళ్లాడు. మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో దుర్గాప్రసాద్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందాడు. తండ్రి సిహెచ్.రాము ఉదయం వచ్చి చూసేసరికి దుర్గాప్రసాద్ ఫ్యాన్‌కు వేలాడి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

సిపిఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరుగు సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను పలుచోట్ల మంగళవారం ఆవిష్కరించారు.

తగరపువలస : స్థానిక జిఆర్ భవన్‌లో సిపిఐ నాయకులు పోస్టర్‌ను విడుదలచేస్తూ ఈ మహాసభల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కానూరు రాంబాబు, మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, సిహెచ్.నరసింహులు, ఎం.సన్యాసమ్మ పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడలోని స్టేట్‌బ్యాంకు సమీపంలో సిపిఐ నాయకులు, ముఠా కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మరుపిళ్ల పైడిరాజు, వాండ్రాసి సత్యనారాయణ, పోతిన వెంకటప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు వేచలపు కాసుబాబు, గొర్లె దేవుడు బాబు కె.కోటపాడులో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొంతపల్లి రామారావు, రెడ్డి అప్పలనాయుడు, సీమూసిరి సూర్యనారాయణ, దమ్ము ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి-మధురవాడ: వార్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు 5వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ మొల్లి హేమలత వినతిపత్రం అందించారు. వార్డులో దశాబ్దాల క్రితం వేసి పూర్తిగా మరమ్మతులకు గురైన రోడ్లు, కాలువలను వెంటనే పునర్నిర్మించాలని, శివశక్తినగర్ నుంచి మారికవలస ఐటి సెజ్ రోడ్డును కలుపుతూ కల్వర్టు, రోడ్డును వెంటనే వేయాలని, బోరవానిపాలెం ప్రధాన రహదారి, కాలువలను పునర్నిర్మించాలని, బొట్టవానిపాలెం చెరువును ఆధునీకరించాలని, మారికవలస పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని, మారికవలస నుంచి ఐటి సెజ్‌కు వెళ్లే 100 అడుగుల రోడ్డులో సెంటర్ లైటింగ్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని, వార్డులో వీధి లైట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రధాన కూడళ్లలో రింగ్ పోల్ లైట్లు ఏర్పాటుచేయాలని మేయర్‌ను కోరారు. మేయర్ స్పందించి దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని హేమలత తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలో శానిటేషన్ కార్యక్రమాలను జిల్లా ప్రజా పరిషత్ అధికారులు పరిశీలించారు. పలు గ్రామాలను జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి.నారాయణమూర్తి మంగళవారం సందర్శించారు. గ్రామాల్లో తాగునీటి బావులు, పారిశుధ్య పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని అధికారులు తనిఖీ చేసి, ప్రతి కుటుంబానికీ మరుగుదొడ్డి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో పారిశుధ్యం కీలకమని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడానికి అధికార యంత్రాంగం మరింత కృషి చేయాలని చెప్పారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎల్‌వి.పాలెం, శొంఠ్యాం గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆనందపురం ఎంపిడిఒ డాక్టర్ బి.జానకి, డిప్యూటీ ఎంపిడిఒ డి.సత్యనారాయణ, ఎల్‌వి.పాలెం గ్రామ కార్యదర్శి అనురాధ, సర్పంచ్ లొడగల రాజేశ్వరి, రమణ పాల్గొన్నారు.

అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎపి సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పెంచినట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పొన్నగంటి రమణ తెలిపారు. జూన్ 15 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు తొలి విడత అడ్మిషన్ల సందర్భంగా ఎస్-ఎస్‌సి 100 మందికి 25 మంది, ఇంటర్మీడియట్ 40 మందికి గాను 35 మంది తమ హైస్కూల్‌లో ప్రవేశం పొందారని తెలిపారు. 14 ఏళ్లు నిండి చదవడం, రాయడం పరిజ్ఞానం ఉన్న వారు, టెన్త్ ఫెయిల్ అయిన వారు, మధ్యలో బడి మానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఎస్-ఎస్‌సిలో ప్రవేశం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. 15 ఏళ్లు నిండి టెన్త్ పూర్తయిన వారు, మధ్యలో ఇంటర్ మానేసిన వారు, ఫెయిల్ అయిన వారు ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు హైస్కూల్ హెచ్‌ఎంను సంప్రదించాలని సూచించారు.

117 మంది పింఛన్ల తొలగింపు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో 117 పింఛన్లను ప్రభుత్వం తొలగించినట్లు ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 95 వికలాంగుల పింఛన్లు, 22 సాధారణ పింఛన్లు ఉన్నట్లు ప్రకటించారు. తొలగించిన వారిలో అర్హులుంటే ఎంపిడిఒను సంప్రదించాలని పేర్కొన్నారు. ఇచ్చిన ఆధారాలను పరిశీలించి గుర్తిస్తామని తెలిపారు.

ఆసియా కప్ టీమిండియా మేనేజర్‌గా పివిఆర్.ప్రశాంత్

ప్రజాశక్తి -ఆనందపురం: భారత క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పివిఆర్.ప్రశాంత్ నియమితులయ్యారు. ప్రశాంత్ భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయుల కుమారుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అల్లుడు. ఆసియా కప్ మేనేజర్‌గా ఎంపికైన ప్రశాంత్‌కు ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ఛాయాచిత్ర ప్రదర్శన గొప్ప అనుభూతినిచ్చిందని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బీచ్‌రోడ్డులో బుధవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఛాయాచిత్ర ప్రదర్శనను పరిశీలించి స్వయంగా తన మొబైల్‌లో పలు ఫోటోలను క్లిక్ మనిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఫొటో జర్నలిస్టులు ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ అద్భుతంగా ఉందన్నారు. వచ్చే సంవత్సరం తప్పకుండా స్క్రీన్ ద్వారా ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శన ప్రతి ఒక్కరూ తిలకించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. దానికి జివిఎంసి తరఫున సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయన్నారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అధ్యక్షుడు వై.రామకృష్ణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జివిఎంసి జోన్ - 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, విశాఖ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ ఫాల్గుణరావు, జివిఎంసి పిఆర్ఓ నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రింట్ మీడియా అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానికంగా ప్రింట్ మీడియా అసోసియేషన్ మంగళవారం ఏర్పడింది. ఈ మేరకు భీమిలిలో ప్రింట్ మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షునిగా పి.రాజేంద్రప్రసాద్ వర్మ (ఆంధ్ర జ్యోతి), ప్రధాన కార్యదర్శిగా సుత్తి శ్రీనివాసరావు (విశాలాంధ్ర), ఉపాధ్యక్షులుగా ఎల్.గణపతిరావు (శ్రీ సూర్య), సహాయ కార్యదర్శిగా ముద్దాడ అప్పలరాజు (న్యూస్ 2020), కార్య నిర్వాహక కార్యదర్శిగా రాజేటి బసవకృష్ణమూర్తి (మన భీమిలి), కోశాధికారిగా ఎ.రోజా (విజన్), అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా పి.రంగధామారావు, డివి.చలపతిరావు,

కె.చిరంజీవిరావు, ముసునూరి సూర్య శ్రీనివాస్, భాగం లక్ష్మి ఎన్నికయ్యారని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

మంత్రి నాదెండ్లను కలిసిన కురిమిన

మంత్రి నాదెండ్లను సన్మానిస్తున్న రామస్వామినాయుడు

ప్రజాశక్తి -పద్మనాభం : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భీమిలి ఎఎంసి చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, సాకేరి శ్రీనుబాబు వేములవలస పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బివి.కృష్ణయ్య శ్రీకాంత్, మజ్జి శ్రీను, వివి.నాయుడు, రాజు, సాగర్, తమ్మిన అప్పలరాజు, బాలు, మూర్తి, కిలారి రమణ, బాలి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: నగరాభివృద్ధికి సహకరించాలని స్థాయిసంఘ సభ్యులను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ కోరారు. మంగళవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన జివిఎంసి స్థాయిసంఘం సభ్యులు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కమిషనర్ స్థాయిసంఘ సభ్యులను అభినందిస్తూ నగరాభివృద్ధికి సంబంధించి పనులపై క్షుణ్ణంగా చర్చించి ఆమోదం తెలిపి సహకరించాలని కోరారు.

సిపిఎం నాయకులు ఢిల్లీరావు మృతి

ప్రజాశక్తి- గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు బి.ఢిల్లీరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఢిల్లీరావు 1967లో శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో జన్మించారు. 7వ తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. ఎనిమిదో తరగతికి షిప్ యార్డ్ హైస్కూల్లో చేరి 10వ తరగతి వరకు చదివారు. ఇంటర్మీడియట్ షిప్‌యార్డు కాలేజీలోనే పూర్తిచేశారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌లో పనిచేశారు. ఆ సమయంలో సిఐటియులో చేరి పలు పోరాటాల్లో భాగస్వాములయ్యారు. ఈ క్రమంలో సిపిఎం సభ్యత్వం తీసుకుని అనేక పోరాటాలు నడిపారు. సిఐటియు స్టీల్ జోన్ కార్యదర్శిగా పనిచేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సమస్యలు, ఇళ్ల స్థలాల పోరాటంలో భాగస్వాములయ్యారు. గంగవరం పోర్టు నిర్మాణ సమయంలో మత్స్యకారులకు న్యాయం జరగాలని పోరాటం నడిపి జైలు జీవితం గడిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, బొడ్డపాడు గ్రామంలో ఢిల్లీరావు అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘన నివాళి

ఢిల్లీరావు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం గాజువాకలోని సిపిఎం కార్యాలయంలో గంట పాటు ఉంచారు. పార్టీ నాయకులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం ఢిల్లీరావు చివరి వరకూ నిలబడ్డారని చెప్పారు. పార్టీ నిర్మాణం కోసం పనిచేశారన్నారు. మొదటి నుంచీ క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, పార్టీ ఆదేశాలను పాటిస్తూ పనిచేశారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, పరిస్థితులకు అనుకూలంగా ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లి పనిచేసేవారని తెలిపారు. ముందుగా షిప్‌యార్డు కాలనీ, లంకెలపాలెం, ఇస్లాంపేట, పెదగంట్యాడ కాలనీల్లో పనిచేశారని చెప్పారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఎం నాయకులు ఎం.రాంబాబు, కెఎం.శ్రీనివాసరావు, జె.అయోధ్యరామ్, శ్రీనివాసరాజు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, యువిఎస్.వర్మ, కిరీటం, సుబ్బన్న, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.మణి, నమ్మి రమణ, పైడిరాజు, లక్ష్మణమూర్తి, బంగారునాయుడు, బైరెడ్డి గురప్ప, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఉన్నారు. ఢిల్లీరావు మృతికి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. గాజువాక పెదగంట్యాడ ప్రాంతంలో కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఢిల్లీరావు చేసిన పోరాటాలను గుర్తుచేశారు.

గాజువాకలోని సిపిఎం కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న లోకనాథం తదితరులు, ఇన్‌సెట్‌లో ఢిల్లీరావు (ఫైల్)

ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి- గాజువాక : అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జివిఎంసి 76వ వార్డు పరిధి ఎస్‌టి.కాలనీలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, బంగారునాయుడు, రమణ, లక్ష్మి, శ్రీదేవి, రాము, తదితరులు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్ పేరుతో ప్రజలపై రూ.వేల కోట్ల భారం పడుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు 200 యూనిట్లు వస్తే ఫ్రీ అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఆ సబ్సిడీ ఎత్తేయాలని ఈ కుట్ర పన్నిందని తెలిపారు.

ఐవిఎఫ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలోని గిగ్లెస్, ఒమ్ని అర్కే, నోవా, ఐవిఎఫ్ లేన్సట్ ఐవిఎఫ్ కేంద్రాలను డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మందికి సంతానోత్పత్తి చికిత్స చేశారో వివరాలడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ గది బయట, లోపల రిసెప్షన్ వద్ద ఐఇసి బోర్డులు ప్రదర్శించాలని, లింగ నిర్ధారణ చేయరాదని ఆదేశించారు. ఫారం-ఎఫ్‌ను పరిశీలించి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని, ఫారం-ఎఫ్‌పై గర్భిణి, స్కాన్ చేసే డాక్టర్ సంతకాలు ఉండాలని చెప్పారు. ధరలపట్టిక ప్రదర్శించాలన్నారు. పిసి, పిఎన్‌డిటి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్కానింగ్ రూమ్‌లో ప్రదర్శించాలని, స్కాన్ మెషిన్స్‌ను మార్చరాదని పేర్కొన్నారు. నిర్దేశించిన సమయం కంటే రెండు నెలల ముందుగా రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్శనలో డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి-గోపాలపట్నం : కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, నియోజకవర్గంలో పరిధిలోని పార్టీ బలోపేతానికి నూతన కమిటీలు వేయాలని నాయకులకు సూచించారు. పార్టీ అనుబంధ కమిటీలను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కూటమి పాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని, వారికి మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్నా, శరగడం రాజశేఖర్, నాయకులు మూర్తి యాదవ్, నారిపిన్ని సత్తిరాజు, పెంటకోట అజయ్‌బాబు, నందవరపు సోములు, మూర్తి పట్నాయక్, కంపర ఆనంద్ పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా ప్రక్రియ ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, బిఎలో హిస్టరీ , పొలిటికల్ సైన్స్, కామర్స్‌లో కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సిలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ కోర్సులు ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : నాదెండ్ల

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి జనసేన పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ పిఎసి ఛైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పౌర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి నాయకుల సమావేశాన్ని ఈ నెల 30వ తేదీన విశాఖలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చెయ్యటంలో ప్రభుత్వం ముందుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేలా చూస్తున్నట్లు తెలిపారు. ఏడాది పాలన పూర్తి కావటంతో జనసేన కార్యకర్తలు, నాయకులుతో సమావేశం ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ హరిప్రసాద్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, విజయకుమార్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నగర పరిధిలో 90 వార్డుల జనసేన పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.

'కురసాల'కు కెకె.రాజు నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ మృతిచెందడంతో కాకినాడలోని వారి నివాసంలో ఉంచిన పార్థివదేహాన్ని పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌టిఎల్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -కరాస/ గోపాలపట్నం: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ (ఎన్‌ఎస్‌టిఎల్) 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని (ల్యాబ్ రైజింగ్ డే) మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఆర్‌డిఒ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్, గౌరవ అతిథిగా నేవల్ సిస్టమ్స్, మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌ఐ.హరప్రసాద్, విశిష్ట అతిథిగా మెటిరియల్ అసిస్టెంట్ చీఫ్ రియర్ అడ్మిరల్ అరవింద్ రావల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ, 1969 ఆగస్టు 20న పదిమంది సిబ్బందితో స్థాపించబడిన ఎన్‌ఎస్‌టిఎల్ ప్రస్తుతం 184 మంది శాస్త్రవేత్తలతో సహా 662 మంది సిబ్బందితో నడుస్తోందని చెప్పారు. నీటి అడుగున ఆయుధాలు, వ్యవస్థల రక్షణ ఆర్ అండ్ డికి గణనీయమైన కృషి చేసిందని తెలిపారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ప్రీమియర్ ల్యాబ్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌టిఎల్‌పై భారత నావికాదళం మాత్రమే కాకుండా దేశం మొత్తం చాలా ఆశలు పెట్టుకుందన్నారు. నీటి అడుగున అత్యాధునిక ఆయుధాలతో దేశ బలోపేతానికి ఎన్‌ఎస్‌టిఎల్ కృషి చేస్తోందని తెలిపారు.

ఎన్‌ఎస్‌టిఎల్ వ్యవస్థాపక దినోత్సవంలో అతిథులు

ముఖ్య అతిథి డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రపంచ భౌగోళిక-రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచస్థాయి నావికా ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి విద్యాసంస్థల చురుకైన భాగస్వామ్యంతో పరిశ్రమలకు ఎన్‌ఎస్‌టిఎల్ మార్గదర్శకత్వం వహించాలని ఆకాంక్షించారు. నిర్దేశిత వ్యవస్థలను ఎన్‌ఎస్‌టిఎల్ త్వరితగతిన అభివృద్ధి చేయడం ద్వారా 2047 నాటికి డిఆర్‌డిఒ సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. 25 సంవత్సరాల సేవాకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వరుణాస్త్ర కోసం బెలూన్ రికవరీ సిస్టమ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజిని డాక్టర్ సమీర్ వి కామత్ చేతులమీదుగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ డైరెక్టర్ (ప్రొడక్షన్) పివి.రాజారామ్‌కు అందజేశారు. ఎన్‌ఎస్‌టిఎల్ అభివృద్ధి చేసిన హైబ్రిడ్ జిటి -ఐఆర్ ఎస్‌ఎస్‌ను అరవింద్ రావల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హెచ్‌ఎన్.దాస్, శాస్త్రవేత్తలు, అధికారులు, ఎన్‌ఎస్‌టిఎల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఆకిరి సునీల్, ఎన్‌ఎస్‌టిఎల్ వర్క్స్ కమిటీ కార్యదర్శి శ్రీజ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుసు కట్టు చెరువులు కాపాడుకోవాలి

- పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ
- షేడ్ నెట్ వ్యవసాయంపై రైతులకు అవగాహన
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో గొలుసుకట్టు చెరువులను కాపాడుకోవాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్, ఉపాధి హామీ, తాగునీటి సమస్యలు, జల్ జీవన్ మిషన్‌లో కొనసాగుతున్న పనులు, మేజిక్ డ్రెయిన్లు, క్యాటిల్ షెడ్లు, షేడ్ నెట్లు, సోక్ పిట్స్, గొలుసు కట్టు చెరువులు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని, కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ కార్యక్రమాలు, తుప్పల తొలగింపు, బావులు, కుళాయిలు, బోర్లు వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వంటి పనులు చేపట్టాలని ఆదేశించారు. గొలుసు కట్టు చెరువులు దెబ్బతింటే నీరు వృధా అవుతుందని, వీటి నిర్మాణాలు పటిష్టంగా, సక్రమంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటింటికి చెత్త సేకరణ సజావుగా జరగాలన్నారు. గ్రామాలలో ఆస్తి పన్నుల వసూలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి పంచాయతీలోనూ 20 సోక్ పిట్లు నిర్మించాలని, తద్వారా నీటి నిల్వల వృద్ధి చెందుతాయని చెప్పారు. షెడ్ నెట్ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. క్షాప్ మిత్రాలకు జీతాలు త్వరితగతిన చెల్లించాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శచీదేవి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డిప్యూటీ సిఈఓ, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులావాణి, డ్వామా పిడి పూర్ణిమాదేవి, ఈవోపీఆర్డీ నాగలక్ష్మి, హార్టికల్చర్ అధికారి ఎంఎ రహీం పాల్గొన్నారు.

44 బంగారు కుటుంబాల దత్తత

అనకాపల్లి : పి4 చొరవ కింద 44 బంగారు కుటుంబాలను జిల్లా అధికారులు దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధికారులు పాల్గొని తమ తమ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను స్వీకరించారు. ఈ కుటుంబాలకు మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, అభివృద్ధి వంటి అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను చేరవేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి ఒక కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా, దత్తత తీసుకున్న కుటుంబాలకు అవసరమైన సహాయం అందించే వరకు క్రమం తప్పకుండా పర్యవేక్షణ బాధ్యతలను చేయాలని సూచించారు. సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన సాధించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

అనకాపల్లి : గృహ నిర్మాణ లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖ కార్యక్రమాల పురోగతిపై డిస్ట్రిక్ట్ హెడ్ హౌసింగ్, జిల్లాలో గల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 4328 ఇళ్లను పూర్తి చేయవలసి ఉందని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు ఆర్థిక సహాయం ఉపయోగించి గృహాల నిర్మాణం చేయవలసి ఉందన్నారు. అదనపు ఆర్థిక సహాయం పొంది ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయని వారి నుండి సదరు మొత్తాలను వసూలు చేయమని ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ హెడ్ హౌసింగ్ వై.శ్రీనివాసరావు, జిల్లాలో గల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

అనకాపల్లి : జిల్లాలో పంచాయతీరాజ్‌కు సంబంధించిన పనులు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పంచాయితీ రాజ్ అధికారులతో పిఆర్‌కి సంబంధించిన పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా నాబార్డు, పాట్ హోల్స్, ఇతర గ్రాంట్స్ వారీగా అడిగి తెలుసుకున్నారు. నాబార్డు ఆర్ఐడిఎఫ్‌కి సంబంధించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగులో ఉన్న మిగిలిన పనుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పంచాయితీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్లు ఆర్‌యస్. ప్రసాద్, జియస్‌యస్. ప్రసాద్, జి.శారదా కుమారి పాల్గొన్నారు.

ఒక గేట్ నుండి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

రైవాడ జలాశయం నుండి వరద నీరు విడుదల

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయం ప్రమాదస్థాయికి చేరువవుతున్న నేపథ్యంలో అధికారులు వరదనీటిని మంగళవారం శారదా నదిలోకి విడిచిపెట్టారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 114.00 మీటర్లు కాగా, మంగళవారం సాయంత్రం నాటికి 113.40 మీటర్లకు చేరింది. ప్రస్తుతం జలాశయానికి సుమారు 2000 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఒక గేటు ఎత్తి, సుమారు 500 క్యూసెక్కుల వరద నీటిని శారదా నదిలోకి విడుదల చేశారు. దీనితో నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ డిఈఈ సత్యం నాయుడు హెచ్చరించారు. వరదనీరు విడుదల కారణంగా దిగువ ప్రాంతాల రైతులు, గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జలాశయ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పోతల పాత్రనాయుడు విజ్ఞప్తి చేసారు.

నీట్ పీజీలో గుర్రం శ్రీనివాస్ కుమార్ ప్రతిభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మెలుపాక గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ నీట్ పీజీలో ప్రతిభ కనబరిచారు. 2025 విద్యా సంవత్సరానికి అఖిల భారత స్థాయిలో జరిగిన నీట్ పీజీ పరీక్షలో శ్రీనివాసకుమార్ జాతీయ స్థాయిలో 1913 ర్యాంక్ సాధించి ఎమ్‌డి జనరల్ మెడిసిన్‌లో చేరేందుకు అర్హత సాధించారు. సూపర్ స్పెషలైజేషన్ చేసి న్యూరాలజిస్ట్‌గా ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ తండ్రి ఆరోగ్య విస్తరణ అధికారిగా చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్నారు. తల్లి జ్యోతి గృహిణి. చెల్లి వీర వెంకట శరణ్య ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతుంది. చిన్నప్పటి నుండి అనుకున్న లక్ష్యాన్ని సాధించడం తన కుమారుడికి అలవాటుని ఆ క్రమంలో తాజాగా నీట్ పీజీలో సీటు దక్కిందని తండ్రి పేర్కొన్నారు. శ్రీనివాస్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

శ్రీనివాస్‌కుమార్

రింగ్ రోడ్డుపై రైతుల వ్యతిరేకత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని అప్పన్నపాలెం జంక్షన్ నుంచి చౌడపల్లి మీదుగా అనకాపల్లి వెళ్లే ప్రధాన రహదారికి ప్రతిపాదించిన రింగ్ రోడ్డు నిర్మాణానికి ఆ ప్రాంత రైతులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. చౌడపల్లి సచివాలయంలో మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ చైతన్య, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్డు వలన ఉపయోగాలు, నష్టపరిహారంగా రైతులకు ఇవ్వనున్న టీడీఆర్ బాండ్లు తదితర వాటిపై వివరించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు తెలపాలని కోరారు. అధికారుల ప్రతిపాదనను రామన్నపాలెం, చౌడపల్లి గ్రామాల రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. రింగ్ రోడ్డుతో తమ జిరాయితీ భూములు నష్టపోతామన్నారు. బంజరు భూములు మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. నగదు రూపంలో పరిహారం చెల్లించాలని, 50 అడుగులు వెడల్పు కంటే ఎక్కువగా భూ సేకరణ చేయరాదని, గృహాలు కోల్పోయిన బాధితులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కూండ్రపు సోమనాయుడు, స్థానికులు గండి బోయిన వెంకట్, ధర్మరెడ్డి నాయుడు బాబు, లాలం సత్తిబాబు, ధర్మరెడ్డి రఘు, డి.సన్యాసినాయుడు, బి.గోవిందు, డి.సత్యం, కాకి శ్రీను, రమణ, లోకనాథం, అప్పలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న సిఐటియు నేత సోమునాయుడు, స్థానికులు

కార్యక్రమంలో పాల్గొన్న సినీ నేపథ్య గాయని కౌసల్య, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

శ్రీప్రకాష్‌లో పాటల పోటీలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా రెండు రోజుల పాటు శ్రీప్రకాష్ విద్యా సంస్థల వివిధ శాఖల (తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం) విద్యార్థుల మధ్య గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలను నిర్వహించారు. ఆరవ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య, కీ బోర్డు ప్లేయర్ రవి శేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా సినీ నేపథ్యగాయని మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యనే కాకుండా అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. కౌసల్య తన పాటల ద్వారా ఆహుతులను ఉత్రూతలూగించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరుస్తుందన్నారు. విజేతలకు అతిథులు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్. మూర్తి, వివిఎస్ఎస్.భానుమూర్తి, డాక్టర్ వివిఎస్‌బి.బంగార్రాజు, డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, బి.సీతారాణి, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

శ్రీప్రకాష్ విద్యా సంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ ప్రారంభించారు. తమ విద్యార్థులు 2004 నుంచి ఇప్పటి వరకు 2,300 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి తమ సేవా నిరతి చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ బ్లడ్ బ్యాంకు ప్రెసిడెంట్ జివిఎల్ఎల్.కిరణ్, రోటరీ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హెచ్ఆర్ వివిఎస్‌బి బంగార్రాజు, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యా బోధన చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలను ప్రేమతో ఆటపాటలు, బొమ్మలు ద్వారా వారికి విద్యా బోధన చేయాలని ఐసిడిఎస్ పిడి ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. మండలంలోని రామచంద్రపురం, గొండుపాలెం-2 అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు, తల్లులతో సమావేశాలు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. అనంతరం కేంద్రాల్లోని సరుకులను పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆమె వెంట సిడిపిఓ లలిత కుమారి, సూపర్వైజర్ అనిత ఉన్నారు.

సముద్రంలో చేపలు మృత్యువాత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పరిశ్రమలు విడుదల చేసే రసాయనిక వ్యర్థ పదార్థాలు సముద్రం నీటిలో కలవడంతో పూడిమడక తీరంలో చేపలు మృత్యువాత పడ్డాయి. మత్స్య సంపద పైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు స్పందించడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలలో తమకు ఉపాధి కల్పించడం లేదని, ఉపాధి పొందుతున్న చేపల వేటకు దూరమై పోతున్నామని మత్స్యకార సంఘం ప్రతినిధి చేపల తాతయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

మృతి చెందిన చేపలు

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలు గ్రామ స్థాయిలో ప్రజలకు అందుతున్న తీరును పరిశీలించడానికి అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ టీం మంగళవారం మండలంలోని పెద్దపూడి అగ్రహారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. రికార్డులలో నమోదు చేసిన వివరాలు ఆధారంగా గర్భిణులు, బాలింతలు, కౌమరదశ బాలికల వద్దకు వెళ్లి, వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా గణాకాధికారి ఏ.రామచంద్రరావు ఇమ్యూనిజషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. వర్షాలు ప్రభావం వలన వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిపిఓ కే.జగదీష్, రవణమ్మ పాల్గొన్నారు.

ఎస్ఇజెడ్ ఏర్పాటుపై వ్యతిరేకత

భూములిచ్చేది లేదని తేల్చి చెబుతున్న రైతులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలంలో ప్రభుత్వం పరిశ్రమల నిమిత్తం ఎస్ఇజెడ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. మండలంలోని ఎర్రవాయి ప్రాంతాలైన మల్లం, చిన్నమల్లం, భూపతిపాలెం, ఆర్.భీమవరం చిన్న భీమవరం, ఆర్.శివరాంపురం, అప్పంపాలెం తదితర గ్రామాల్లో పరిశ్రమల కోసం ఎస్ఇజెడ్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ గ్రామాల్లో 1697 ఎకరాల సాగు భూమిని ఎస్ఇజెడ్ ఏర్పాటుకు సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పది పదిహేను రోజుల క్రితం ప్రజల అభిప్రాయాలను తీసుకునే నిమిత్తం మల్లం, ఆర్.శివరాంపురం, ఆర్. భీమవరం తదితర గ్రామాల్లో మండల రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. భూములివ్వండి, పరిశ్రమలు పెడతాం, అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ గ్రామసభల్లో పలువురు రైతులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గ్రామాల్లో పరిశ్రమల వద్దని భూములను సాగు చేసుకుంటూ జీవిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు కూలీ సంఘం వంటి సంఘాల ఆధ్వర్యాన ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో పరిశ్రమల వద్దని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజుకు, మండల తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రాలు అందజేశారు. ప్రజలు, రైతులు ఆందోళనకు సిద్ధం కావడంతో అధికారులు ప్రస్తుతం మిన్నకున్నారు.

ఈ ప్రాంతంలో సుమారు 800 ఎకరాలు జిరాయితీ భూములు కాగా, సుమారు 900 ఎకరాల వరకు డి.పట్టా భూములు, పట్టాలు లేకుండా సాగు చేస్తున్న ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఎటువంటి పరిశ్రమలు పెడతారు, సేకరించే భూములకు పరిహారం ఎంత ఇస్తారు, నిర్వాసితులకు ఉపాధి వంటి ఏ అంశాలపై అధికారులు చెప్పడం లేదు. పరిశ్రమల పేరుతో ఇక్కడి భూములను కాజేయడానికి కుట్ర జరుగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చేది లేదని తేల్చిచెబుతున్నారు.

ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్‌ఫొటో)

భూములు విడిచిపెట్టేది లేదు

మా గ్రామాల్లో వ్యవసాయం ఆధారంగా తాతల కాలం నుండి సాగు చేసుకుంటు జీవిస్తున్నాం. రకరకాల పంటలు పండించుకుంటూ బతుకుతున్నాం. ఈ భూములు విడిచి పెట్టేది లేదు. మాకు పరిశ్రమలు వద్దు.

- నమ్మి రాజు, రైతు, ఆర్.శివరాంపురం

భూములను లాక్కోవడానికే..

పరిశ్రమల ఏర్పాటు పేరుతో ఏడు గ్రామాల్లో భూసేకరణకు మేము వ్యతిరేకంగా ఉన్నాం. అవసరమైతే ఆందోళన చేస్తాం. ప్రభుత్వం బంజరు భూములు, డి.పట్టా భూములు అధికంగా ఉండడంతో ఆ భూములను ప్రజల నుండి లాక్కోవాలని చూస్తుంది. ఏడు గ్రామాల ప్రజలు జీడి, మామిడి, సరుగుడు, వరి, గంటి తదితర పంటలు వేసుకుని సాగు చేసుకుంటున్నాం. భూములు ఇచ్చే ప్రసక్తి లేదు.

- బి అమ్మునాయుడు, ఆర్ భీమవరం సర్పంచ్

వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ హైమావతి

పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హైమావతి అన్నారు. మండలంలోని చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం పొందిన వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆస్పత్రిలో కుక్కకాటు, పాముకాటు వాటికి అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అనంతరం వ్యాక్సియేషన్, ల్యాబ్, స్టోర్స్, రికార్డులను పరిశీలించారు. గర్భిణుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ కెఎం.నాయుడు, ఎల్‌డిసి పద్మావతి, పీహెచ్ఎన్.కనకవేణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని వాణిజ్య సముదాయాలు, షాపులలో యజమానులు చెత్త బుట్టలు ఏర్పాటు చేసి, చెత్తను పంచాయతీ చెత్త బండిలో ప్రతిరోజు వేయాలని ఇన్చార్జి ఎంపిడిఓ కేఎస్ ప్రసాద్ నారాయణరావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పలు షాపులు, వాణిజ్య సముదాయాలకు వెళ్లి చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాలంలో చెత్త రోడ్లపైనా, డ్రైనేజీలలో వేస్తే అపారిశుధ్యం పెరిగి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. షాపులలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయకుంటే వారి షాపులు, వాణిజ్య సముదాయాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో వైవి రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామంలో మహిళలు, పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈనెల 20న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా మూడు రోజులపాటు జరిగే ఈ కబడ్డీ పోటీలను జనసేన పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ సుందరపు సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లసానికి, ప్రశాంతతకు దోహదపడతాయన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, దేశవ్యాప్తంగా తమ సత్తా చూపాలన్నారు. టిడిపి సీనియర్ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు మిత్రమండలి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి ముసలి నాయుడు, టెక్కలి పరశురాం, ఆడారి జగన్నాథరావు, మొల్లేటి సత్యనారాయణ, నూకాలయ్య, ఆడారి గణేష్, పిన్నమరాజు వాసు, మల్ల రాజేష్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంఎస్ఎంఇ శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి ఎస్సీ కాలనీ సామాజిక భవనంలో ట్రేజ్ ఐటి ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పి. విజయ్‌కుమార్ పర్యవేక్షణలో జులై 21 నుండి ఈ నెల 19వ తేదీ వరకు జరిగిన 30 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జరిగిన ఎంఎస్ఎంఈ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. పరిశ్రమ ఏర్పాటు, లాభనష్టాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు గూర్చి ట్రైనర్ గండి సత్యనారాయణ తెలియజేశారు. ముగింపు కార్యక్రమంలో సబ్బవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.రమేష్ ప్రోగ్రాంను పర్యవేక్షణ చేసి రుణాలు మంజూరుకు సమ్మతిని తెలియజేశారు. రెండో బ్యాచ్‌కు 18 నుండి 45 సంవత్సరాల వయస్సు గల ఔత్సాహిక నిరుద్యోగ యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9963174608, 9573960852 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

శిక్షణ పొందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు

వీడని మహిళ హత్యకేసు మిస్టరీ

- నిందితుల కోసం ముమ్మరంగా పోలీసుల గాలింపు
- సమాచారం ఇచ్చే వారికి రివార్డ్ ప్రకటన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి జిల్లా కేంద్రాన్ని అనుకుని ఉన్న సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్ద గుర్తు తెలియని మహిళ హత్య కేసుకు సంబంధించిన మిస్టరీ వీడలేదు. ఈ కేసు పోలీసులకు సవాల్ విసురుతుందా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. ఈ నెల 14న జరిగిన ఈ ఉదంతంలో నిందితుల ఆచూకీ ఇంకా తెలియరాలేదు. కేసులో ఏమాత్రం పురోగతి కనిపించకపోవడం లేదు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి 16కు ఆనుకొని ఉన్న ప్రాంతంలోనే పాక్షికంగా కాలిన మహిళ మృతదేహం లభ్యం కావడం సంచలనంగా మారింది. పోలీసులు టీములుగా ఏర్పడి ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నా కేసులో పురోగతి లేదు. దీంతో నిందితుల ఆచూకీ కోసం రివార్డ్‌ను సైతం పోలీసులు ప్రకటించారు. ఊరు చివర ఉన్న పొలాల మధ్యలో మహిళను చంపి పెట్రోల్ లాంటి ద్రావణం పోసి తగలపెట్టారు. ఆ రోజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సంఘటన స్థలాన్ని పరిశీలించి హత్య చేసిన వారిని గుర్తించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నా నిందితుల ఆచూకీ మాత్రం తెలియరాలేదు. మహిళ హత్య మిస్టరీ మరికొన్ని రోజుల్లో తప్పకుండా పరిష్కారమవుతుందని పోలీసులు ధీమాగా ఉన్నా కేసు వెనుక ఉన్న అసలు వ్యక్తులను ఎవరో అంచనా వేయలేని పరిస్థితి కొనసాగుతుంది.

264 మందికి వికలాంగ పింఛను తొలగింపు నోటీసులు

అభ్యంతరం ఉంటే వారంలోగా అర్జీ పెట్టుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వం ద్వారా వికలాంగు పింఛన్ పొందుతున్న 264 మందికి పింఛను తొలగింపు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సదరం క్యాంపులో వికలాంగ సర్టిఫికెట్ల పున:పరిశీలన చేసి 40 శాతానికి తక్కువగా ఉన్నట్లు నిర్ధారించిన వారికి ఈ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. వీరితో పాటుగా 64 మంది వికలాంగులకు ప్రస్తుతం నెలకు రూ.15వేలు పింఛను నుంచి రూ.6000 పింఛన్‌కు తగ్గించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే నోటీసులు తీసుకున్న వారికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ సదరన్ సర్టిఫికెట్‌తో నోటీసు తీసుకున్న వారం రోజుల్లోగా ఎంపీడీవోకు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. వారి సదరం సర్టిఫికెట్ పరిశీలించిన పిదప వారు నిజమైన అర్హులైతే వెంటనే వికలాంగు పింఛను అర్హతను బట్టి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నోటీసులు జారీ చేసినంత మాత్రాన ఏ ఒక్కరూ ఆందోళన పడవలసిన అవసరం లేదని, సదరన్ సర్టిఫికెట్‌లో అర్హత ఉన్నట్లయితే ఏ ఒక్క పింఛను తొలగించడం జరగదని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

షేక్ షాహిన్

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో నివాసం ఉంటున్న షేక్ షాహిన్ (45) అదృశ్యంపై ఆయన భార్య సాజీద్ కశింకోట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన షేక్ షాహిన్ కుటుంబం 10 సంవత్సరాలుగా కశింకోట మెయిన్ రోడ్‌లో ముత్తూట్ ఫైనాన్స్ పక్కన బిర్యాని పాయింట్ నడుపుతూ, అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో షేక్ షాహిన్ బిర్యానీ సామానులు తేవడానికి ఎపి31 డిఎం 1177 స్కూటీపై అనకాపల్లి వెళ్లి తిరిగి రాలేదు. వారం రోజులుగా బంధువులు, పరిచయస్తుల ఇళ్లలో వెతికినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కశింకోట పోలీసులకు ఆయన భార్య సాజీద్ ఫిర్యాదు చేశారు. ఇంటి నుండి వెళ్లినప్పుడు షాహిన్ నల్ల ప్యాంట్, ఆకుపచ్చ రంగు షర్ట్ ధరించి వెళ్లారు. ఫిర్యాదు మేరకు కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి సిఐ స్వామినాయుడు, ఎస్ఐ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూర విద్య టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎపి సార్వత్రిక విద్యా పీఠం (దూర విద్యా విధానం) ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్‌లో 2025-2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు స్థానిక అయ్యన్న విద్యా సంస్థల దూరవిద్య స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్ డాక్టర్ ఖాశీం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాల వయస్సు, చదవటం, రాయడం పరిజ్ఞానం కలవారు, పదవ తరగతి పరీక్షలు ఫెయిలైన వారు, చదువుతూ మధ్యలో మానేసిన వారు పదో తరగతిలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. 15 ఏళ్లు నిండి పదవ తరగతి పూర్తయిన వారు, ఇంటర్మీడియట్ ఫెయిలైన వారు, చదువుతూ మధ్యలో మానేసిన వారు ఇంటర్మీడియట్ కోర్సులో చేరి ఐదు సబ్జెక్టులతో సింగిల్ సిట్టింగ్ విధానం ద్వారా కోర్సు పూర్తి చేయవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 15వ తేదీలోగా టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులలో చేరవచ్చునని, వివరాల కోసం స్టడీ సెంటర్ల పనివేళల్లో నేరుగా సంప్రదించవచ్చని డాక్టర్ ఖాశీం పేర్కొన్నారు.

రామయ్యనాయుడు మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ మండల కార్మిక నేత, సీనియర్ రాజకీయ నాయకుడు కోన శంకర ఆది రామయ్యనాయుడు మంగళవారం మృతి చెందారు. రామయ్యనాయుడు మృతికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సంతాపం తెలియజేశారు. ఆయన ఈ ప్రాంత కార్మిక ఉద్యమానికి తీరని లోటని గనిశెట్టి పేర్కొన్నారు. ఎన్టీపీసీ కార్మిక సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలం పోరాటాలు చేశారని, వామపక్ష భావజాలంతో పీడిత తాడిత ప్రజల తరుపున నిలబడ్డారని తెలిపారు. బొగ్గు లారీల కాలుష్యం, ఎన్టీపీసీ కార్మిక సమస్యలపై జరిగిన అఖిలపక్ష ఉద్యమాల్లో సైతం అగ్రగామిగా నిలిచారని గుర్తు చేశారు.

'కూటమి ప్రభుత్వంలో బిసిలకు మేలు'

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని నాయీ బ్రాహ్మణ రాష్ట్ర సాధికారత సమితి సభ్యులు పేలూరి సత్యనారాయణ అన్నారు. నాయీ బ్రాహ్మణులకు 150 నుంచి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇచ్చినందుకుగాను హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని తుమ్మపాల మెయిన్ రోడ్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రి వెంకట సన్యాసినాయుడు, నడిపల్లి గణేశ్వరరావు, కోన అప్పారావు, సంఘం నాయకులు కేసనకుర్తి అప్పారావు, పేకేటి వరప్రసాద్, మాటూరు చిన్నారావు, గణేష్ పాల్గొన్నారు.

28వ రోజుకు దళిత రైతుల దీక్షలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జీవనాధారమైన భూములను నాశనం చేస్తున్న క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మాకవరపాలెం మండలం జి. కోడూరు గ్రామ దళిత రైతులు చేపడుతున్న రిలేదీక్షలు మంగళవారం 28వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఎండావానల్లో 28రోజులుగా దీక్షలు చేస్తున్నా, అధికారులు, నేతలు స్పందించకపోవడంపై దళిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో దళిత రైతులకు జరిగిన అన్యాయం, నష్టంపై ఆందోళన చేస్తుండగా, ఇప్పటివరకు దీక్షాశిబిరాన్ని అటు అధికారులుగానీ, నేతలుగానీ ఎవరూ సందర్శించలేదని ఆవేదన వెలిబుచ్చారు.

ఆల్ ఇండియా బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు మాట్లాడుతూ దళిత రైతులనే నిర్లక్ష్యం, వివక్షతోనే 28 రోజులుగా దీక్ష చేస్తున్నా ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, క్వారీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, జి. కోడూరు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగల బస్‌స్టాండ్ ఏరియాలో రోడ్డు గుంతలు పడటంతో తాత్కాలికంగా గుంతలను పూర్తి రానున్న రోజుల్లో పర్మినెంట్ రోడ్డు వెయ్యడానికి చర్యలు తీసుకోవాలని టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి నాయుడుకు విన్నవించారు.మంగళవారం గుంతలమయమైన రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో సెక్రెటరీ వడ్డాదిబాబు బూత్ కన్వీనర్లు ఢిల్లీ నానాజీ, మంగరాజు, పల్లెల రాము, కోడూరు సూరి గంటే గణేష్, మువ్వల అప్పారావు, జొన్నపిల్లి రమేష్ పాల్గొన్నారు.

నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టొద్దు!

- ఆర్‌ఆర్ ప్యాకేజీ రూ. 25లక్షలు చెల్లించాల్సిందే
- ప్యాకేజీ తేల్చకుండా బ్యాంకు అకౌంట్లు తీసుకోవడం దారుణం
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు



నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణలో నివాస గృహాలు, ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ విషయంలో అన్యాయం చేసి నోట్లో మట్టికొట్టొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు. నిర్వాసితులందరూ ఆర్‌ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఒకపక్క ఉద్యమం చేస్తుంటే, వారి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలని చూడడం సమంజసం కాదన్నారు.

మంగళవారం మండలంలో అమలాపురం పంచాయతీ మూలపర్రలో నిర్వాసితులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాజయ్యపేట, బోయపాడు, బుచ్చిరాజుపేట కొత్తూరు, చందనాడ పంచాయతీలో కర్రివారివీధి, తమ్మయ్యపేట, తుమ్మలపేట, అమలాపురం పంచాయతీల్లో పాటిమీద, మూలపర్ర, డిఎల్‌పురం, ఒడపేట గ్రామాలకు చెందిన 745 కుటుంబాలను పెదబోదుగల్లం వద్ద పునరావాసం కల్పించి అక్కడకు తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. గత నెల 31న ఆర్‌అండ్‌ఆర్ అధికారి వివి రమణ ఆధ్వర్యంలో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటి స్థలాలు కేటాయింపునకు లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించగా, నిర్వాసితులందరూ ముందు ఆర్‌ఆర్ ప్యాకేజీ గురించి తేల్చాలని, రూ.25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని పట్టుపట్టారని గుర్తు చేశారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితులు పోరాటం చేస్తుంటే, నిర్వాసితుల డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా, అధికారులు, అధికార, ప్రతిపక్ష నాయకులు నిర్వాసితులు దగ్గర బ్యాంకు అకౌంట్లు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. కారిడారల్‌లో. భూములు, ఇల్లులు సర్వస్వం కోల్పోయి నిర్వాసితులను మోసపుచ్చే చర్యలను మానుకోవాలన్నారు.2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి, నిర్వాసితులకు అన్యాయం చేస్తే న్యాయస్థానం ముందు నిలబడతామని హెచ్చరించారు. వివాహమైన ఆడపిల్లలకు, అర్హత కలిగిన మనవడు, మనవరాళ్లుకు ప్యాకేజీ ఇవ్వాలని, అందరికీ ఆర్ కార్డులు జారీ చేయాలని, వెంటనే జిల్లా సంప్రదింపుల కమిటీ వేసి నిర్వాసితులతో జిల్లా కలెక్టర్ చర్చలు జరిపి రూ.25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు రావి నానాజీ, ఎస్.చంటమ్మ,టి.గణేష్,టి.లక్ష్మి, ఎస్.గోవింద్, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల అభివృద్ధికి విరాళాలు

ఆర్‌ఒ ప్లాట్ ఏర్పాటుకు విరాళం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి -మాడుగుల : మండలంలోని ఎమ్.కోడూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సౌకర్యాల కల్పనకు పలువురు దాతలు విరాళాలు అందించారు.ే గ్రామానికి చెందిన టిడిపి అధ్యక్షులు, పాఠశాల పూర్వ విద్యార్థి, పోతిన అర్జున రావు అతని మిత్రులు కలిసి ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటుకు రూ..25వేలు విలువ చేసే స్టీల్ వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. అలాగే పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఏడుగురు ఉపాధ్యాయులు ఉమ్మడిగా పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు విరాళం అందించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి అప్పాన భాస్కరరావు రూ.5వేలు పాఠశాల అభివృద్ధికి విరాళంగా అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, మింది కొండాజీ, యర్రంశెట్టి మోహన్ సంయుక్తంగా గత ఏడాది 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు, ప్రస్తుతం 10, 9 చదువుతున్న ఆరుగురు ఉత్తమ విద్యార్థులకు కలిపి రూ.20,000లు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అలాగే పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీరామమూర్తి గత ఏడాది 10 తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ.4,500లు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. దాతలను గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి అప్పారావు తదితరులు అభినందించారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

రోగులకు పాలు రొట్టె పంపిణీ చేస్తున్న ఫోటోగ్రాఫర్స్

ప్రజాశక్తి నక్కపల్లి: ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్వేర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక 50 పడకల ఆసుపత్రిలో సూపరెంటిండెంట్ డాక్టర్ శిరీష చేతుల మీదగా రోగులకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ప్రతినిధులు పి చక్రరావు, ఎస్ త్రిమూర్తులు, పి సతీష్, నాగేంద్ర,ఆనంద్ కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

ముంపు పైర్ల సస్యరక్షణకు సూచనలు

నక్కపల్లిలో పొలంలో నాట్లు వేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : దమ్ములో (డిఎపి) భాస్వరం ఎరువులు వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహనరావు రైతులకు సూచించారు మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వేంపాడు, చిన రామభద్రపురం గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో వరి నాట్లు పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరిలో పంట కాలంలో 32 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను వేసుకోవాలన్నారు. మొదటి దమ్ము చేసేటప్పుడు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి దమ్ము చేయడం ద్వారా పచ్చిరొట్ట ఎరువులు ,కలుపు ఎరువుగా మారతాయన్నారు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయని యెడల చివరిదమ్ములో 50 కిలోల డిఎపి, 15 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుందన్నారు. దుబ్బు కట్టే దశలో సుమారు 25 నుంచి 35 రోజులకు దశలో కలుపు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా వెయ్యాలన్నారు. అంకురం దశలో (అడుగు పొట్ట దశలో) ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలని రైతులకు తెలియజేశారు. వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దేవవరం, చిన రామ భద్రపురం, గోడిచెర్ల, ఉద్దండపురం, గుల్లిపాడు రమణయ్యపేట, దోశలపాడు, ముకుందరాజుపేట, జిజె పురం , దొంకాడ గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఇఒ సత్యనారాయణ, ఆర్‌ఎస్ కె సిబ్బంది అజయ్, మోహన్, రైతులు పాల్గొన్నారు.

41హెక్టార్ల వరిపైర్లు నీటి మునక

చీడికాడ : మూడు రోజులలో కురిసిన వర్షాలకు చీడికాడ మండలంలో41 హెక్టార్లలో వరి పంట నీటి ముంపునకు గురైందని మండల వ్యవసాయాధికారి ఎ.కృష్ణవేణి తెలిపారు. మంగళవారం జైతవరం, అర్జనగిరి, సిరిజాం, చీడికాడ, తురువోలు, తంగుడుబిలి గ్రామాల్లో నీట

చీడికాడలో ముంపు పైర్లు పరిశీలిస్తున్న ఎఒ కృష్ణవేణి

మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలాల్లో మునిగిన నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని, నీటి ముంపు తొలగిన తర్వాత వరిపైర్లకు బూస్టర్ డోస్ కింద 20 కిలోల యూరియా, 10కిలోల పొటాష్‌ను వేసుకోవాలని సూచించారు. నీటి ముంపుతో తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున హెక్సాకొనజోల్ 400 మిల్లీలీటర్ల మందునునీటిలో కలిపి ఎకరా పైరుకు పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

కోటవురట్ల : ఫొటాస్ ఎరువులతో పైరుకు రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని ఎండపల్లి, అన్నవరం గ్రామం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజిని అన్నారు, మండల వ్యాప్తంగా విస్తారంగా వరినాట్లు జరుగుతున్న తరుణంలో రైతులకు పలు సూచనలు చేశారు. దమ్ము పట్టాక వరి నాట్లుకు పోటాష్ ఎరువును వాడడం వల్ల వేరు వ్యవస్థ దృఢంగా పెరగడంతోపాటు పిలకలు కట్టి పైర్లు వృద్ధి చెందుతాయని సూచించారు.రైతులంంతా ఈ క్రాప్‌లో తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

మాడుగుల : మండలంలో అవురువాడ పంచాయతీ లోవ వీరనారాయణం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అనసూయ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం కొండేపూడి వ్యవసాయశాస్త్రవేత్తలు వరి పంట పొలాలను సందర్శించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కృసి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.రాజా కుమార్ కే, మాట్లాడుతూ నీట మునిగిన పంట పొలాల్లో వీలైనంత తొందరగా నీటిని తొలగించి బూస్టర్ డోస్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. సైంటిస్ట్ సేద్యవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ. సౌజన్య డాక్టర్ ఎన్ సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ చింతలపాటి కల్యాణ చక్రవర్తి రాజు,రైతులు విఎఎ లు పాల్గొన్నారు



మాడుగులలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

భారీ నాగుపాము హతం

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో కోడి పోతురాజు రాజు ఇంటి సమీపంలో సంచరిస్తున్న నాగుపామును మట్టుబెట్టారు. భారీసర్పాన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు గురికాగా, కోడి పోతురాజు దాన్ని హతమార్చడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న పరిస్థితుల్లో ఎక్కడికక్కడే విషసర్పాలు దర్శనమిస్తుండడంతో స్థానికులు, ముఖ్యంగా రైతులు, కూలీలు భయాందోళనకు గురౌతున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి : పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు అన్నారు. మంగళవారం మండలంలోని దోసులపాడులో పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి పొడి చెత్త సేకరణపై గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహ రాజు పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని వినతి

ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న వాచ్‌మెన్‌లు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వాచ్‌మెన్‌ల వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నైట్‌వాచ్‌మెన్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ పాఠశాలలల్లో పనిచేస్తున్న వాచ్‌మెన్‌లకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, ఇలాగైతే వారి కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల వాచ్‌మెన్‌ల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, అలాగే వారికి కనీస వేతనం రూ.16వేలు చెల్లించాలని, యూనిఫాం, టార్చిలైట్, గుర్తింపుకార్డులు, బీమా, ఉద్యోగ భద్రత ఇతర సౌకర్యాలను కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో స్కూలు వాచ్‌మెన్‌ల సంఘం అధ్యక్షులు హేమాలయ, కార్యదర్శి సత్తిబాబు, వాచ్‌మెన్‌లు పాల్గొన్నారు

ఐఎఫ్‌సిఒ అక్రమాలపై చర్యలకు సిద్ధం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఇంటిగ్రేటేడ్ ఫార్మర్ కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఐఎఫ్‌సిఒ) పేరిట పలువురితో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టించి ముఖం చాటేసిన మోసగాళ్లపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. గతేడాది డిసెంబరులో పెదబొడ్డేపల్లిలో ప్రముఖుల సమక్షంలో కార్యాలయం తెరిచి, ఎనిమిది నెలల్లోనే లక్షల్లో వసూలు చేసి, ప్రజలను మోసగించిన సంస్థ ప్రతినిధులు, తాజాగా తెలంగాణలో కార్యాలయం తెరిచినట్లు అందిన సమాచారంతో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. పెద్దబొడ్డేపల్లి కార్యాలయం కేంద్రంగా జరిపిన అక్రమాలను ఉదహరిస్తూ తెలంగాణ స్పీకర్‌కు లేఖ రాసినట్లు ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ ఐఎఫ్‌సిఒ సంస్థ కార్యకలాపాలపై నిఘా పెట్టి, సమగ్ర దర్యాప్తు చేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు అలాగే ఇక్కడి బాధితులకు న్యాయం జరిగేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని లేఖలో కోరారు. కాగా పెద్దబొడ్డేపల్లిలో కార్యాలయం ప్రారంభించిన సమయంలో ఇక్కడ అన్నక్యాంటీన్ నిర్మాణానికి ఐఎఫ్‌సిఒ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడికి అందించిన విషయం తెలిసిందే.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

.మాట్లాడుతున్న ఎపిఎం కుమారస్వామి

ప్రజాశక్తి -నక్కపల్లి : డ్వాక్రా మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని బ్యాంకు లింకేజీ డిపిఎం కుమారస్వామి అన్నారు. మండలంలో ఎన్ నరసాపురంలో వెలుగు ఏపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు పొందిన మహిళా సమైక్య సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బ్యాంకు రుణాల ద్వారా వ్యాపారాలు సాగించి జీవనోపాధి పొందాలన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకొని లక్షాధికారులు కావాలన్నారు. పుస్తకాల నిర్వహణ పక్కాగా నిర్వహించాలని సూచించారు.బుక్ కీపింగ్ చాలా ప్రాధాన్యత కలిగిన అంశమన్నారు. ఈ కార్యక్రమంలో సిసి సన్యాసిరావు ,, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

736 కిలోల గంజాయి పట్టివేత

మూడు చోట్ల 21 మంది నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

నర్సీపట్నంలో గంజాయి నిందితులతో డిఎస్‌పి శ్రీనివాసరావు, పోలీసులు

ప్రజాశక్తి -మాడుగుల : ఒడిశాలో కొనుగోలు చేసి, అల్లూరి ఏజెన్సీ మీదుగా మోత కూలీల సహాయంతో అంతర్రాష్ట్రాలకు తరలిస్తున్న ఎండు గంజాయిని భారీ స్థాయిలో మాడుగుల పోలీసులు పట్టుకున్నారు. అనకాపల్లి డిఎస్‌పి ఎం శ్రావణి అందించిన వివరాలివి.

ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఒడిశాలో కొనుగోలు చేసి జి మాడుగుల ఏజెన్సీ నుంచి మోతకూలీల సహాయంతో తరలిస్తున్న 320కిలోల గంజాయిని పట్టుకున్నారు.జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా ఆదేశాలతో కె కోటపాడు సీఐ పి.పైడిపునాయుడు పర్యవేక్షణలో మాడుగుల ఎస్ఐ జి నారాయణరావు సిబ్బందితో సోమవారం సాయంత్రం బొడ్డరేవు సమీపంలో మాటువేసి పట్టుకున్నారు. గోను సంచులతో 18మంది మోత కూలీలతో కొండదారిన గంజాయిని బైపాస్‌కు తీసుకొచ్చి, ఎపి31 టిడి 2387గల ఆటోలో ఎక్కిస్తున్న సమయంలో పట్టుకున్నారు. 16మంది నిందితులను పట్టుకోగా, మరో ముగ్గురు పరారయ్యారని డిఎస్‌పి తెలిపారు. ఆటోతోపాటు, రెండు బైకులు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిందితులు దుక్కేర్తి బుజ్జిబాబు (జి మాడుగుల), దలాయి చంటిబాబు(పెదబయలు), కిలో కొండబాబు(పాడేరు), వి మాడుగుల మండలం శంకరం పంచాయతీ తాడివలసకు చెందిన పాగి ఈశ్వరరావు, వంతల కిశోర్, జీ.మాడుగులకు చెందిన వంతల సతీష్, వంతల అశోక్, వంతల నాగరాజు, కిల్లో చిరంజీవి, కొర్ర చిన్నారావు, వంతల గణేష్, కొర్రా జగన్, కొర్రా తిరుపతి, పొంగి రాంబాబు, చింతపల్లి మండలానికి చెందిన కిల్లో సింహాద్రి, కొర్రా చంద్రావులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించగా, విశాఖపట్నం సెంట్రల్ జైలుకు మంగళవారం సాయంత్రం తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.16లక్షలు ఉంటుందని డిఎస్‌పితెలిపారు. గంజాయిని, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్స్ పీసీలు బి.లీలా ప్రసాద్. వై మోదబాబు. కె పైడినాయుడు, ఓంగారు కె రమణలను నగదు రివార్డుతో సత్కరించారు .కార్యక్రమంలో చీడికాడ, మాడుగుల ఎస్ఐలు బి సతీష్,, జి.నారాయణరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ఒడిశా చిత్రకొండ నుంచి తమిళనాడుకు తరలిస్తున్న 9బస్తాల్లో రూ.54లక్షల విలువైన 216 కిలోల గంజాయిని పట్టుకుని, ముగ్గురు నిందితులను నర్సీపట్నం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు ఒక కారు, రెండు బైకులు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసకున్నారు. మంగళవారం నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి పి.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ ఈగల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా సమాచారం మేరకు నర్సీపట్నం గ్రామీణ సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ రామారావు, నర్సీపట్నం రూరల్ ఎస్ఐ పి.రాజారావు తమ సిబ్బందితో గొలుగొండ మండలం కొమిర వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, రెండు వాహనాల్లో 216 కేజీలు గంజాయి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 54 లక్షలు, ఇతర సామగ్రితో కలిపి మొత్తం రూ.75 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమిళనాడుకు చెందిన తరుణ్ కుమార్ గోపి, చింతపల్లి మండలం దోమలగొంది గ్రామానికి చెందిన గడుగు కొండబాబు, చిత్తూరు జిల్లా సత్యవేడుకు చెందిన ఎ.దినేష్‌లను అరెస్ట్ చేశారు. గంజాయి పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను అభినందించారు.

మాడుగులలో గంజాయి నిందితులతో డిఎస్‌పి శ్రావణి

పాయకరావుపేట : పాయకరావుపేట పోలీసులకు సుమారు రూ.40 లక్షలు విలువగల 200 కిలోల గంజాయి పట్టుబడింది. నర్సీపట్నం డిఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం... ఒడిశా నుంచి గబ్బాడ మీదుగా నర్సీపట్నంకు 200 కేజీల గంజాయిని ఎర్రమిల్లి నాగశివ ఆటోలో తీసుకువచ్చాడు. అక్కడ నుంచి ఢిల్లీ రిజిస్ట్రేషన్ కలిగిన సెకండ్ హ్యాండ్ కారులో నక్కపల్లిలో నెల్లిపూడి వద్ద తోటలో గంజాయిని డంప్ చేశారు. డంపు చేసిన సరుకును బైపురెడ్డి రత్నం అనే మహిళ మూడు లక్షల రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి కొనుగోలు చేసి సరుకులు ఎక్స్‌యువి 500 తెలుపు రంగు కారులో లోడ్ చేసి రాజమండ్రి రవాణా చేస్తుండగా మార్గమధ్యంలో సీతారాంపురం జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడింది. కారులో ఉన్న 40 లక్షల రూపాయలు విలువ చేసే 200 కేజీల గంజాయి, ఒక కారు, నాలుగు సెల్ ఫోన్లు, 3000 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. బైపురెడ్డి రత్నం అనే మహిళతోపాటు ఎర్రమిల్లి నాగ వీరశివ, కోళ్ల నాగ సతీష్ తదితర ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గంజాయిని పట్టుకున్న సిఐ అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ కుమార్ సిన్హా నర్సీపట్నం బీఎస్పీ శ్రీనివాస్ అభినందించారు.

6, 7 తేదీల్లో సిఐటియు జిల్లా 13వ మహాసభ

పోస్టర్‌ను ఆవిష్కరించిన సంఘం నేతలు

సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకరరావు, శ్రీనివాసరావు, వరలక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-చోడవరం

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా 13వ మహాసభలు సెప్టెంబర్ 6, 7 తేదీల్లో చోడవరంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకర్రావు తెలిపారు. మహాసభల పోస్టర్‌ను శంకరరావుతో పాటు సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, ప్రేమ చంద్రశేఖర్, రైతు సంఘం నాయకులు ఎస్‌వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఈ మహాసభలో కార్మికులు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై గత మూడేళ్ల కాలంలో నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుకోవడం జరుగుతుందని చెప్పారు. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. దీనిని జయప్రదం చేయటానికి చోడవరం ప్రాంత ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ జిల్లాలోనే అతిపెద్ద సంఘంగా సిఐటియు ఉందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపైనా, ఇటీవల కాలంలో కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు, రాష్ట్రంలో 12 గంటలకు పని పెంపునకు వ్యతిరేకంగానూ ఉద్యమించినట్లు తెలిపారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఫార్మా, ఎస్ఈజెడ్, కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలు అరికట్టాలని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, రైతులు బకాయిల చెల్లించాలని అనేక పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చోడవరంలో జరుగుతున్న 13వ జిల్లా మహాసభ జయప్రదం చేయడానికి కృషి చేయాలని కోరారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		